## నిర్ణీత సమయానికే హాజరుకావాలి

రామగిరి, జూన్ 16: అంతర్గత ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్జీ-3 ఏరియా సెంటినరీకాలనీలోని రాణీ రుద్రమదేవి స్టేడియంలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఈపీ ఆపరేటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

## మిస్సింగ్ కేసు

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 16: ఎన్టీపీసీ పోలీస్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన అట్లా శ్రీనివాస్ అనే ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుడు కనిపించకపోవడం తో ఆదివారం ఎన్టీపీసీ పోలీస్టేషన్‌లో మిస్సింగ్ కేసునమోదైంది. గత నెల మే 31వ తేదీన ఇంటి నుంచి విధులకు వెళ్లిన అట్లా శ్రీనివాస్ ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతడి భార్య అట్ల రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ ఏఎస్ తిరుపతి కేసు నమోదు చే సుకొని దర్యాప్తు ప్రారంభించాడు. అచూ కీ తెలిసిన వారు 871 265 6524, 8712656526 సెల్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

## అంజన్న సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ

మల్యాల, జూన్ 16 : కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హెల్త్ అండ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఇక్కడ ఆలయ పర్యవేక్షకు డు సునీల్, సీనియర్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఉన్నారు.

## కాపర్‌వైర్ల చోరీపై ఆరా

కథలాపూర్, జూన్ 16 : మండలంలోని పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల శివారులోని ఎస్సారెస్పీ వరదకాలువకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్ల కాపర్ వైర్ల దొంగతనంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కథలాపూర్ ఎస్ఐ నవీన్‌కుమార్ పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల శివారులో వరదకాలువ వెంబడి ఆదివారం పరిశీలించారు. బాధి త రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజుల వ్యవధిలో సుమారు 30 విద్యుత్ మోటర్ల కాపర్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు.

ధర్మారం: గురువులతో పత్తిపాక జడ్పీ స్కూల్ 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఫర్టిలైజర్‌సిటీ: సమ్మేళనంలో పాల్గొన్న శ్రీరామ స్కూల్ పూర్వ విద్యార్థులు

# ఆ 'పాత' మధురం

- పత్తిపాక జడ్పీ స్కూల్‌లో ఘనంగా 1988-89 టెన్త్ బ్యాచ్ సమ్మేళనం
- ఆటపాటలతో సందడి
- విద్యనేర్పిన గురువులకు సన్మానం

ధర్మారం, జూన్ 16: మండలంలోని పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరిట ఒక్కచోట చేరారు. పరస్పరం పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. హోదాలను మరిచి నృత్యాలతో హోరెత్తించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. సామూహికంగా విందారగించిన అనంతరం బై..బై చెబుతూ మధుర స్మృతులతో ఇండ్లండ్లకు వెళ్లిపోయారు.

### అ'పూర్వ' సమ్మేళనం

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 16: పట్టణంలోని శ్రీరామ విద్యాలయంలో 2003-04 పదోతరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. డ్యాన్స్‌లు చేస్తూ మైమరిచిపోయారు. ఈ సందర్భంగా బోధించిన గురువులను శాలువాలతో సన్మానించుకున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు పిట్టల మొండయ్య, ఇస్మాయిల్, రమేశ్, శ్రీనివాస్, కొమురయ్య, విద్యార్థులు నవీన్‌కుమా ర్, సాగర్, సందీప్, మహేందర్, రాజ్‌కుమార్, రాకేశ్, జహంగీర్, మధుసూదన్, తదితరులు ఉన్నారు.

అవార్డులు స్వీకరిస్తున్న ఉప్పు ముత్యం, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

## జిల్లా ఫొటోగ్రాఫర్లకు జాతీయ అవార్డులు

ఓదెల/ ధర్మారం జూన్ 16: జిల్లాకు చెందిన ఇద్దరు ఫొటోగ్రాఫర్లకు జాతీయస్థాయి అవార్డులు దక్కాయి. సిగ్మా అకాడమీ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో కులు, మనాలి, హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి 11వరకు జాతీయ ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన ఉప్పు ముత్యం జాతీయ అవార్డు, బంగారు పతకం సాధించారు. ధర్మారానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి కాంస్య పతకం లభించింది.గ్రామీణ ప్రాంత ఫొటోగ్రాఫర్ల ప్రతిభను వెలికితీయడానికి సిగ్మా అకాడమీ ఈ పోటీలను నిర్వహించింది. ఇందులో ముత్యం ఆర్ట్ ఫోటోగ్రఫీలో, శ్రీనివాస్‌రెడ్డికి ట్రావెల్ ఫొటోగ్రఫీలో అవార్డులు సాధించారు. వీరికి అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ అవార్డులు ప్రదానం చేశారు. తోటి ఫొటోగ్రాఫర్లు, స్వచ్ఛందసంస్థల బాధ్యులు ప్రతిభ చూపిన ఫొటోగ్రాఫర్లను అభినందించారు. భవిష్యత్‌లోనూ రాణించాలని అభిలషించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శ్రావ్యంజలిని అభినందిస్తున్న జడ్పీటీసీ సంధ్యారాణి

కోల్‌సిటీ, జూన్ 16: మహిళలు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అన్ని రంగాల్లో రాణించాలని పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఇటీవల కర్ణాటకలోని బాగల్ కోర్టులో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ వూషూ లీగ్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన సిగిరి శ్రావ్యంజలి 'సాండా ఫైటింగ్ జూనియర్-60 కేజీ విభాగంలో తెలంగాణ రాష్ట్రం తరపున ఆడి బం గారు పతకం సాధించింది. ఈమేరకు ఆదివా రం శ్రావ్యంజలితోపాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన కోచ్ కుమార్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వుషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే.కుమార్, శ్రావ్య తల్లిదండ్రులు నరేశ్, లావణ్య, నాయకులు కోడూరి రమేశ్, రాజు, కందుల పోచం, బాలు తదితరులు పాల్గొన్నారు.

## గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

పరీక్షలు చేస్తున్న మెడికవర్ వైద్యులు

ఎలిగేడు, జూన్ 16: ఎలిగేడు హైస్కూల్ ఆవరణలో ఆదివారం జిల్లా పద్మశాలీ సం ఘం కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 200ల మం దికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకున్న వారికి వైద్యపరమైన పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ, మెడికవర్ యాజమాన్యం పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఫ్రీ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలీ సంఘం అడ్‌హాక్ కమిటీ చైర్మన్ వలుస నీలయ్య, దవాఖాన ఇన్‌చార్జి గుర్రం కిరణ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## అప్పన్నపేటలో పెద్దమ్మ బోనాల సందడి

బోనాల వేడుకల్లో బోనం ఎత్తుకున్న నల్ల మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్, జూన్ 16: మండలంలోని అప్పన్నపేటలో ముదిరాజ్ కులస్తులు పె ద్దమ్మకు బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఊరి శివారులోని ఆలయానికి వెళ్లారు. బోనాలు పెట్టి పట్నం వేసి నైవేద్యం సమర్పించారు. పిల్లాపాపలను సల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నేత, నల్ల పౌండేషన్ వ్యవస్థాపకులు నల్ల మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నీలి సతీశ్, ఉపాధ్యక్షుడు అనవేని లక్ష్మయ్య, డైరెక్టర్లు పిడుగు సంతోష్, అనవేని శంకర్, నీలి రాజు, చీకటి సతీశ్, నీలి సతీశ్, పిడుగు మల్లేశ్, పిడుగు రాయమల్లు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో మూడు ఎడ్ల మృతి

సారంగాపూర్, జూన్16 : బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ స్తంభం విరిగి, తీగలు మీద పడడంతో మూడు ఎడ్లు షాక్ గురై మృతి చెందాయని తెలిపారు. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఎడ్లు మృతి చెందాయని నారపాక సుధాకర్, నారపాక మమత, పూదరి లలిత ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ. 2 లక్షం నష్టం జరిగిందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వేడుకున్నారు.

## నాణ్యమైన విద్యకు కేరాఫ్ 'కాకతీయ'

- 'పది'లో విద్యార్థుల సత్తా
- ఆహ్లాదకర వాతావరణంలో బోధన
- ఎన్ఎస్‌వోలో 37, ఐఎంవోలో 79 మంది విద్యార్థులకు పతకాలు
- క్రీడల్లోనూ అత్యుత్తమ ఫలితాలు

మంథనిలోని కాకతీయ ఉన్నత పాఠశాల

మంథని, జూన్ 16: మంథనికి చెందిన కాకతీయ ఉన్నత పాఠశాల నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్నది. 10వ తరగతి ఫలితాల్లో ఈ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి ఔరా అనిపించారు. మంథని బస్టాండ్ ఏరియాలో పచ్చటి చెట్ల నడుమ మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో నెలకొల్పిన పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పించారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటూ యాజమాన్యం ముందుకు సాగుతున్నది. ప్రత్యేకంగా ఒలింపియాడ్, ఐఐటీని బోధిస్తున్నారు. 4వ తరగతి నుంచే విద్యార్థులకు నవోదయ, గురుకులాల్లో సీట్లు సాధించేలా శిక్షణ అందిస్తున్నారు. దీని ఫలితమే ప్రతీ సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న చెకుముఖి సైన్స్ పోటీ పరీక్షల్లో కాకతీయ పాఠశాలలో చదివే విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరు స్తూ డిస్ట్రిక్ లెవల్ వరకు వెళ్తున్నారు. 2023-24 లో నిర్వహించిన ఈ పోటీల్లో సైతం ఈ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థ అయిన ఎస్‌వోఎఫ్ వారు నిర్వహించిన ఎన్ఎస్‌వోలో-37 మంది, ఐఎంవోలో-79 మంది విద్యార్థులు సెకండ్ లెవల్‌కు క్వాలీఫై కావడంతో పాటు మెడల్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలలో చదివే నలుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించగా 100 శాతం విద్యార్థులు ఉ త్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. యేటా కాకతీయ పాఠశాలలో చదివే విద్యార్థు లు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఆత్మరక్షణ కోసం విద్యార్థులకు చిన్ననాటి నుంచి కరాటే ఇన్‌స్ట్రక్టర్ ద్వారా కరాటే శిక్షణను సైతం ఇస్తున్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా యాజమాన్యం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నది.

### బంగారు భవిష్యత్‌కు బాటలు..

మెరుగైన విద్యనందిస్తూ విద్యార్థుల బం గారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం. అనుభవజ్ఞులైన టీచర్లను నియమించి మెరుగైన విద్యనందిస్తున్నాం. స్కూల్ ఆవరణలో పచ్చని చెట్లను పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించినం. ఒలింపియాడ్, ఐఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నం. 4వ తరగతి నుంచే విద్యార్థులకు నవోదయ, గురుకులాల్లో సీట్ల సాధన కోసం కోచింగ్ ఇప్పిస్తున్నం. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించినం. దూర ప్రాంతాల విద్యార్థులకు బస్సులు, ట్రాలీలను ఏర్పాటు చేశాం.

– నీహెచ్ ప్రవీణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, కాకతీయ స్కూల్ మంథని.

10జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఎన్ఎస్‌వో, ఐఎంవోలో పతకాలు సాధించిన విద్యార్థులు

## మార్నింగ్ వాకర్స్ ఔదార్యం

- స్టేడియం కీపర్ కుమార్తె పెండ్లికి రూ.లక్ష సాయం

ఇంతియాజ్‌కు నగదు అందజేస్తున్న ఖని జేఎల్ఎన్ స్టేడియం వాకర్స్

కోల్‌సిటీ, జూన్ 16: నడకలోనే కాదు, నడపడికలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం మార్నింగ్ వాకర్స్. ఉదయాన్నే మైదానానికి చేరుకొని ఆరోగ్యం కోసం వ్యాయామం చేస్తుండగా చిగురించిన స్నేహంతో 'జేఎల్ఎన్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్' ఏర్పాటు చేసుకొని సమాజ సేవ కూడా చేస్తున్నారు. ఇం దులో భాగంగానే 35 ఏండ్లుగా స్టేడియం కీపర్‌గా పని చేస్తున్న ఇంతియాజ్‌కు అండగా నిలిచారు. ఇటీవలే అతని కుమార్తె వివాహం నిశ్చయమైంది. పెళ్లి ఖర్చులు భారంగా ఇంతియాజ్ ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన వాకర్స్, ఒకరికొకరుగా విరాళాలను పోగు చేశారు. ఆదివారం ఉదయం వ్యాయామం అనంతరం ఇంతియాజ్ కుటుంబ సభ్యులకు దాదాపు రూ.లక్ష నగదు సాయం, 75 కిలోల బియ్యాన్ని అందించి ఉదారతను ప్రదర్శించారు.

### కోటిలింగాలలో ఏఎస్పీ

వెల్గటూర్, జూన్ 16 : మండలంలోని కోటిలింగాల కోటేశ్వరస్వామిని జగిత్యాల ఏఎస్పీ వినోద్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి, సన్మానించారు.

## చిన్నారికి కొవ్వొత్తులతో నివాళి

కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న హరిపురం గ్రామస్తులు

ముత్తారం, జూన్ 16: సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలో కామాంధుడి చేతిలో హత్యకు గురైన చిన్నారి స్మత్యార్థం హరిపురం గ్రామంలో మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్‌రావు ఆధ్వర్యంలో యువకులు, నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. గ్రామ కూడలిలో చిన్నారి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. నిందితుడిని బహిరంగా ఉరి తీయాలని ఈ సందర్భంగా పలువురు డిమాండ్ చేశారు.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత

నగేశ్ తల్లికి నగదు అందజేస్తున్న స్నేహితులు

ఓదెల, జూన్ 16: అకాల మరణం పొందిన స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఔదార్యాన్ని చాటారు. రూ. 20 వేల ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ పెండెం నగేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెం దాడు. దీంతో ఓదెల మండలంలోని అతని స్నేహితులు తలా కొంత డబ్బులు జమ చేసి ఆదివారం నగదును నగేశ్ తల్లికి అందజేశా రు. కార్యక్రమంలో స్నేహితులు అల్లం సతీశ్, ఇరుకుల్ల వీరేశం, క్యాతం సంతోష్, జక్కుల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓదెల మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం

క్యూలైన్లో భక్తులు

ఓదెల, జూన్ 16: ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము వరకే ప్రత్యేక వాహనాలు, రైళ్లు, బస్సుల్లో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఇక్కడ స్వామి వారికి ముగ్గుల పట్టితో పట్నం వేసి, అన్నం వండి బోనంతో నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

## 7 ఎల్ ఈపీ ప్రమాద మృతులకు నివాళి

నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 16: 2003, జూన్ 16న సింగరేణి చరిత్రలోనే అత్యం త ఘోర ప్రమాదం జీడీకే-7 ఎల్ ఈపీ గనిలో 17 మంది కార్మికులు మృత్యువా త పడ్డారు. యాజమాన్యం నిర్ల క్ష్య ధోరణితోనే గని ప్రమాదం సంభవించిందని ఆనాడు హైకోర్టు చీఫ్ జస్టిస్ జరిపిన విచారణలో యాజమాన్యాన్ని దోషి గా నిర్ధారించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు బాధిత కార్మిక కు టుంబాలను పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు కార్మిక సంఘాల నాయకులు దుయ్యబట్టారు. ఈ మేరకు ఆదివారం గని వద్ద గల ప్రమాద మృతుల స్మారక స్తూపం వద్ద టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ నాయకులు నివాళులర్పించారు. ఈ గనిని పర్యాటక కేంద్రంగా ప్రకటించారు కానీ అభివృద్ధికి ప్రణాళిక తయారు చేయడం, నిధులు కే టాయించడం లేదని విమర్శించారు. కా ర్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు మాదాసు రాంమ్మూర్తి, నూనె కొ మురయ్య, పర్లపల్లి రవి, ఐలి శ్రీనివాస్, జనక్ ప్రసాద్, నరసింహారెడ్డి, ధర్మపురి, దాస్, సదానందం, సత్యనారాయణ రెడ్డి, పోల్ భాస్కర్ రావు, లింగమూర్తి, ప్రభాకర్, చిలుముల అవినాశ్, ఆరె రమేశ్, మ సూద్ అలీ, శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, సైదులు, కనకయ్య, రవీందర్, శ్రీను, ప్రవీణ్‌కుమార్, ఉమేశ్ తదితరులున్నారు.

## నేడు ఎన్టీపీసీలో విద్యుత్ ప్రజావాణి

జ్యోతినగర్, జూన్ 16: ఎన్టీపీసీ పీకే రామయ్యకాలనీ సబ్‌స్టేషన్‌లోని మేడిపల్లి సెక్షన్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి టీజీ ఎన్‌పీడీసీఎల్ మేడిపల్లి అసిస్టెంట్ ఇంజినీర్ అరెపల్లి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంప్రదించాలని కోరారు.

## ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ కమిటీ

శివకృష్ణ

తిరుపతి

ధర్మారం,జూన్16: ధర్మారం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి శివ క్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా సోగాల తిరుపతి, కోశాధికారిగా ఓరెం చిరంజీవి,ఉపాధ్యక్షులుగా దేవి అఖిల్, మహంకాళి ప్రతాప్, సంయుక్త కార్యదర్శులుగా దేవి విజయ్, గాజుల రాజేశ్, ప్రచార కార్యదర్శులుగా సోగాల వంశీ క్రిష్ణ, బొల్లి వంశీక్రిష్ణ, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిని గౌరవాధ్యక్షుడిగా దేవి రాజమల్లయ్య, సలహాదారులుగా అబ్దుల్ ముజాయిద్, తలమ క్కి రవీందర్‌శెట్టి, దేవి నళినీకాంత్, గుమ్మడి చిరంజీవి, గుడికందుల ఎల్లయ్య ఎన్నికయ్యారు.

చిరంజీవి

## శాలగుండ్లపల్లిలో కళాజాత

ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ముత్తారం, జూన్ 16: మండలంలోని శాలగుండ్లపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం కళాజాత నిర్వహించింది. బడిబాట, ప్రభుత్వ స్కూళ్లలో సౌకర్యాలపై కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఇందులో సారథి కళాకారులు కోండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశ్‌గౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కట్కూరి శ్రీవల్లి ఉన్నారు.

## పెరికపల్లి క్రికెట్ టోర్నీ విజేత కమ్మర్‌ఖాన్

ధర్మారం, జూన్ 16: ధర్మారం మండలం పెర్కపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. మూడు వారాలపాటు జరిగిన పోటీల్లో మండలంలోని పలు గ్రామాల నుంచి జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో కమ్మర్‌ఖా న్ పేట జట్టు పెరికపల్లి జట్టుపై విజయం సాధించింది. విజేతకు ప్రభుత్వ విప్ ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ తరపున రూ.20 వేల నగదును కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ప్రదానం చేశారు.

## తండ్రిపై హత్యాయత్నం

మంథని, జూన్ 16: మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్పటకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గంట బాలయ్యపై ఆయన పెద్ద కుమారుడు నాగరాజు కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఎస్ఐ వెంకట కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య ఇటీవల తన భూమిని విక్రయించాడు. ఇందులో కొంత నగదును పెద్ద కుమారుడికి ఇచ్చేందుకు నిర్ణయించాడు. కానీ ఎక్కువ మొత్తంలో డబ్బు కావాలని పెద్ద కుమారుడు ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో ఉన్న సమయంలో బాలయ్యపై నాగరాజు ముందస్తు పథకం ప్రకారం తనతో తీసుకొచ్చిన కత్తితో పొడిచేందుకు యత్నించాడు. అక్కడే ఉన్న చిన్న కుమారుడు శంకర్ అడ్డుకున్నాడు. ఈ ఘటనలో శంకర్ గాయపడ్డాడు. కాగా, బాలయ్య ఫిర్యా దు మేరకు నాగరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

డాక్యుమెంట్ పోయినది

★నాయొక్క భూమికి సంబంధించిన డాక్యుమెంట్ (సేల్ డీడ్) నెం॥ 4307/97, మంకమ్మతోట, నుండి కోర్టు చౌరస్తా వెళ్ళే దారిలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికినచో ఈక్రింది నెంబర్‌కు తెలుపగలరు. వి.సుజాత సెల్: 9618624624
NTK-319927

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194